క్లుప్తంగా

గది నిర్మాణానికి భూమి పూజ

నాదెండ్ల: సాతులూరులోని ముస్లిం ఖబరస్తాన్‌లో అంత్యక్రియల సామగ్రి భద్రపరిచేందుకు అవసరమైన గది నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. వక్ఫ్‌బోర్డు రూ.6 లక్షల నిధులు మంజూరు చేయటంతో గది నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం, నూతన దుస్తులు వితరణ



వినుకొండ(నూజెండ్ల): బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీ మాధవరావు ఆధ్వర్యంలో నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం పంపిణీ చేశారు. 5వ వార్డు కౌన్సిలర్ పోలూరి అంజలీదేవి, సుబ్బారావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, పి.నారాయణరావు, శ్రావణ్‌కుమార్, విశ్వనాథశాస్త్రి, ఎ.గోపాలకృష్ణమూర్తి, రామకృష్ణ, శశికళ, చింతలపూడి భద్రయ్య, మురళీధర్, సుబ్బారావు, హరనాథ్‌బాబు, ఎం.వి.శర్మ, సుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, సుబ్బారావు, రామ్మూర్తి, నరేష్ పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా చిరు జల్లులు

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం కూడా ఎడతెరిపి లేకుండా చిరు జల్లులు పడ్డాయి. మండల కేంద్రమైన రొంపిచర్లలో ఆదివారం ఉదయానికి 2.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. వర్షం కారణంగా గ్రామాల్లో చిత్తడి వాతావరణం నెలకొంది. వర్షంతో ఎండిపోయిన వాగుల్లో జల ప్రవాహం ప్రారంభమైంది. వర్షం కారణంగా వ్యవసాయ పనులు నిలిచి పోవటంతో రైతులు, రైతు కూలీలు గృహాలకే పరిమితమయ్యారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



రాజుపాలెం: మండలంలోని కొండమోడు పరిధి వీరమ్మ కాలనీలో గల దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ పిల్లల, వృద్ధుల ఆశ్రమంలో ప్రతిభ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ చైర్మన్ పాశం శ్రీనివాస రెడ్డి గురు పౌర్ణమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి పాశం మహిపాల్‌రెడ్డి, సభ్యులు చెవుల స్వామి, దీనమ్మ సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మాతంగి సుధాకర్



పెదకూరపాడు: రాష్ట్రంలో దళితులపై హత్యలు, లైంగిక దాడులు ఒక పక్క జరుగుతుంటే మరో పక్క దేశానికి రాజ్యాంగం రాసిన మహానుభావుడు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలపై కూడా దాడులు జరగడం బాధాకరమని మాల మహానాడు పెదకూరపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మాతంగి సుధాకర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కృష్ణా జిల్లా పెడన మండలంలో దళితులు ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేయడం సరికాదన్నారు. శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని దళితులపై దాడులతో పాటు అంబేడ్కర్ విగ్రహాలు ధ్వంసం చేస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. దాడులు చేసిన వారిని గుర్తించి వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో గరుడ వాహన సేవ



సత్తెనపల్లి: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ దైవం అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో శ్రీవారి గరుడ వాహన సేవ నిర్వహించారు. శ్రీవారికి స్నపన తిరుమంజన సేవ, గోత్రనామాలతో అభిషేకాలు ఆలయ అర్చకులు శ్రీమాన్ చిత్రకవి శ్యాము ఆచార్యులు రామానుజ స్వామి నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై గరుడ వాహన సేవలో పాల్గొని గరుడ ముద్దతో పాటు శ్రీవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు



సత్తెనపల్లి రోడ్డులోని షిరిడి సాయిబాబా మందిరంలో స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేటలో భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నరసరావుపేట: షిరిడి సాయిబాబా మందిరాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్, సత్తెనపల్లి రోడ్డులోని మందిరాల్లో స్వామిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పలువురు పట్టణ ప్రముఖులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. అన్నప్రసాద వితరణ ప్రారంభించగా, మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి భక్తులకు ప్రసాదం వడ్డించారు. సాయంత్రం స్వామికి పల్లకి ఉత్సవం నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తనకు చదువు చెప్పిన గురువులను ఆత్మీయంగా సన్మానించారు. ప్రకాష్‌నగర్, రామిరెడ్డిపేటల్లో నివాసం ఉంటున్న ఎస్ఎస్ఎన్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే మూర్తి, గణిత అధ్యాపకులు జేఎల్ఎం మూర్తి, సైన్స్ ఉపాధ్యాయురాలు పొలూరి నాసరమ్మలను వారి ఇళ్లకు వెళ్లి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

మండలంలో..

నరసరావుపేట రూరల్: గురు పౌర్ణమి వేడుకలను ఆదివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. లింగంగుంట్ల, జొన్నలగడ్డ, ఎన్ఎస్‌పీ కాలనీ, కోటప్పకొండలోని సాయిబాబా మందిరాల్లో సాయినాథునికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో సాయినాథున్ని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. లింగంగుంట్ల సాయిబాబా మందిరంలో నిర్వహించిన పూజల్లో ఆర్డీఓ సరోజిని పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త పొన్నపాటి ఈశ్వరరెడ్డి, విజయకృష్ణారెడ్డి ఉన్నారు. పౌర్ణమి సందర్భంగా కోటప్పకొండ గిరి ప్రదక్షిణ భక్తులు నిర్వహించారు. సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం అందజేశారు.

శ్రీ ఆదిపరాశక్తి క్షేత్రం..

నాదెండ్ల: సమాజ నిర్మాణంలో గురువు పాత్ర అద్వితీయమైనదని శ్రీ ఆదిపరాశక్తి క్షేత్రం పీఠాధిపతి నిత్యవిద్యానంద భారతీ స్వామి చెప్పారు. గణపవరం శివప్రియనగర్‌లోని శ్రీ ఆదిపరాశక్తి క్షేత్రంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. భక్తులు పీఠాధిపతిని సత్కరించి ఆశీర్వాదాలు పొందారు. చిలకలూరిపేట నూతన మార్కెట్‌యార్డు సమీపంలోని షిరిడిసాయి సేవాశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. ప్రసాద వితరణ అనంతరం అన్నదానం చేశారు. జయ జయ సాయి అఖండ సాయి నామ సంకీర్తన నిర్వహించారు. బాబాకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యూవీ శివరామయ్య, శిఖాకొల్లి పాపారావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. గణపవరం శాంతినగర్‌లోని షిరిడి సాయి ఆలయంలో పూజారి ఫణి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నాదెండ్ల, చిరుమామిళ్ల సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కారుమంచిలో..

శావల్యాపురం: మండలంలోని కారుమంచిలోని సాయిబాబా మందిరం వార్షికోత్సవ గురుపౌర్ణమి ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండు వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను వైభవంగా ఊరేగింపు నిర్వహించారు.

వినుకొండలో..

వినుకొండ(నూజెండ్ల): శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ హిమాలయ గురూజీ సమక్షంలో వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లిలోని సాయి బృందావనంలో గురుపౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలి ఏకాదశి నాడు కొండపై తృతీయ అఖండ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన వారందరికి హిమాలయ గురూజీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కనిగండ్ల కోటేశ్వరరావు, పెండేల పుల్లారావు, కాశీ, సురేష్ పాల్గొన్నారు. పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీలో ఉన్న సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచి బాబాకి పూర్వక మహన్యాస, పూర్వక ఏకాదశ రుద్రం, పంచామృత స్నానం అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు గరు బ్రహ్మేంద్ర శర్మ, ఆలయ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఉప్పలపాటి నరసయ్య, ఎన్వీ నారాయణ, గుంట గురునాథం, మూర్తి, కూచి నాగేశ్వరరావు, వంకాయల పాటి హనుమయ్య పాల్గొన్నారు.



కారుమంచిలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



లింగంగుంట్ల సాయినాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆర్డీఓ సరోజిని



గణపవరంలో నిత్యవిద్యానంద భారతీస్వామి ఆశీర్వాదాలు పొందుతున్న భక్తులు

యడ్లపాడు మండంలో..

యడ్లపాడు: మండలంలోని కొత్తసొలస షిరిడి సాయిబాబా మందిరంలో లో గురు పౌర్ణమి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం లక్ష్మణాచార్యులు, పరుచూరి రాఘవేంద్ర ఆధ్వర్యంలో బాబా వారికి వివిధ రకాల అభిషేకాలు, విశేషాలంకరణ చేశారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: మండలంలో బుచ్చిపాపన్నపాలెం, రొంపిచర్ల, కొత్తపల్లి, అచ్చయ్యపాలెం గ్రామాలలోని షిరిడీ సాయి బాబా మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ అన్నదాన కార్యక్రమం జరిగింది.



వినుకొండలో పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

మిస్సింగ్ కేసు 24 గంటల్లో ఛేదించిన పోలీసులు



నరసరావుపేట రూరల్: ఇంటి నుంచి వెళ్లిపోయిన వివాహిత, ఆమె కుమారుడిని రూరల్ పోలీసులు 24 గంటల్లోనే కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. ఇస్సప్పాలెం పంచాయతీ పరిధిలోని సాయినగర్‌కు చెందిన అల్లంపల్లి అంజలిర వళి, ఆమె కుమారుడు విరాజ్‌లు ఈనెల 20వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీనిపై ఆమె భర్త అల్లంపల్లి శివశంకర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి రూరల్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బృందం విచారణ చేపట్టింది. అంజలిరవళి, విరాజ్‌లు ఒంగోలులో ఉన్నట్టు గుర్తించిన పోలీసులు అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. అంజలిరవళి ఇష్టప్రకారం ఆమె తల్లి తుమ్మెపల్లి సీతకి అప్పగించారు. మిస్సింగ్ కేసును 24 గంటల్లోనే ఛేదించిన రూరల్ సీఐ మల్లికార్జున, ఎస్ఐ బాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ బాబూరావు, హోమ్‌గార్డ్ సుభానిలను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించారు.

ఘనంగా మల్లికార్జున ఖర్గే జన్మదిన వేడుకలు

నరసరావుపేట: పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట అసెంబ్లీ బాధ్యులు ఎస్ఎం బాషా, బీసీ సెల్ జిల్లా నాయకులు పూర్ణ, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు నాగేంద్ర, సోషల్ మీడియా రవికిషోర్, ప్రవీణ్, భరత్, ప్రేమ్, రమేష్ పాల్గొన్నారు.

రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



నూతన కార్యవర్గ అధ్యక్షుడికి నియామక పత్రాలు అందజేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

నరసరావుపేట: సమాజానికి రోటరీక్లబ్ లాంటి సంస్థలు చేసే సేవలు చాలా అవసరమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. ఆదివారం బరంపేటలోని శ్రీపాద కల్యాణ మండపంలో 2024–25 ఏడాదికి నియమితులైన నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వాలు ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా పేదలకు రోటరీ, లయన్స్, రెడ్‌క్రాసు లాంటి సంస్థలు చేస్తున్న సేవలు మరువలేనివని అన్నారు. తమ ప్రభుత్వం తరఫున వాటికి కావాల్సిన సహాయ సహకారాలు అందజేస్తామని, అవసరమైన సమయంలో వారి సేవలను వినియోగించుకుంటామని అన్నారు.

ఈ సందర్భంగా రోటరీ ప్రతినిధులు మాట్లాడుతూ మల్లమ్మసెంటర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు ఎటువంటి పబ్లిక్ మరుగుదొడ్లు లేవని, ప్రభుత్వం స్థలం చూపిస్తే ఆ మార్గంలో తమ సంస్థ తరఫున నిర్మించి ఇస్తామని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ జిల్లా కలెక్టర్‌తో సంప్రదించి స్థలం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తాను కూడా రోటరీ ప్రతినిధిగా సభ్యత్వం స్వీకరించారు. కాగా, నరసరావుపేట రోటరీ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారిగా ఎన్నికైన కపలవాయి రాజేంద్రప్రసాద్, సాతులూరి శివకుమార్, కట్టమూరి ఆంజనేయులుతో డెప్యూటీ గవర్నర్ డాక్టర్ కొండవీటి రామకోటయ్య ప్రమాణస్వీకారం చేయించారు. ఇండక్షన్ ఆఫీసర్‌గా అసిస్టెంట్ గవర్నర్ ఎం.సుమిత్ర కుమార్ వ్యవహరించగా అతిథులుగా కేపీ రంగారావు, తాళ్ల రాజశేఖరరెడ్డి హాజరయ్యారు. పాత కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి శ్రీనివాసరావు, చెక్కా రాజేష్, కోశాధికారి ఎంవీ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

వ్యాపారులకు న్యాయం చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వ్యాపారికి సంఘీభావం తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని స్టేషన్‌రోడ్డులోని కేబీఆర్ కాంప్లెక్స్ ఆవరణలో కూలగొట్టిన కూరగాయల షాపుల వ్యాపారులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు న్యాయం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం తన షాపు కోల్పోయిన వ్యాపారి చింత శ్రీనివాసరావు చేస్తున్న నిరసన దీక్షకు సీపీఐ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హఠాత్తుగా మున్సిపల్ అధికారులు షాపు పగులకొట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు. నిరుపేదలైన కూరగాయలు అమ్ముకొని జీవిస్తున్న చిన్న చిరు వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేయటం ఏ మాత్రం భావ్యం కాదని అన్నారు. తక్షణమే బాధితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు ఉప్పలపాటి రంగయ్య, బాధితులు రామిశెట్టి శంకరు, అనిల్, సుబ్బారావు సాంబయ్య, శివ, కోటేశ్వరరావు సుబ్బయ్య అన్నమయ్య పాల్గొన్నారు.

బయటకు అడుగేస్తే మడుగే...



మతుకుమల్లిలో అధ్వానంగా రోడ్డు

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వానలు దాటికి గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు చిత్తడిగా మారాయి. దీంతో ప్రజలు రోడ్డుపై అడుగుతీసి అడుగు వేయలేకపోతున్నారు. చిన్నపాటి గుంతలు పెద్దవిగా మారటంతో వాహనదారులు ఆగచాట్లు పడుతున్నారు. గ్రామాల్లో మురుగు కాలువల్లో పారిశుద్ధ్యం పూర్తిస్థాయిలో పనులు చేపట్టకపోవడం వలన దోమలు విజృంభిస్తున్నాయి. – శావల్యాపురం

రిటైర్డ్ హెచ్ఎం ప్రసాదరావుకు సన్మానం

సత్తెనపల్లి: గురు పౌర్ణమి పురస్కరించుకొని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ఉన్నవ పూర్ణచంద్ర ప్రసాదరావును శ్రీ సరస్వతి శిశుమందిర్ కమిటీ సభ్యులు ఆదివారం పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. పట్టణంలోని వావిలాల వారి వీధిలో గల శ్రీ సరస్వతీ శిశు మందిర్ ప్రాథమిక పాఠశాలలో కమిటీ సమావేశం అనంతరం సన్మానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల సమితి కార్యదర్శి ఎంఎస్‌వీ నాగరాజు, బాధ్యులు గణపవరపు రంగారావు, పెండ్యాల హరేరామ్, డి.సాంబశివరావు, వాసు, సమితి కోశాధికారి దేవతి సాంబశివరావు, ఆచార్యులు, మాతాజీలు తదితరులు ఉన్నారు.

పేద వృద్ధులకు పెన్షన్ల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ – ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో ఆగస్టు 20న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు తెలిపారు. ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 పేదలకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ అతిథిగా పాల్గొన్న మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మద్దు రామకృష్ణయ్య మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతి నెల 108 మందికి రూ.500 చొప్పున పెన్షన్లు ఇవ్వడతో పాటు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించి, ఔషధాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా సివిల్స్ శిక్షణ పొందే విద్యార్థులకు రూ.3 లక్షల విరాళాన్ని ప్రకటించారు. గురుపౌర్ణమి సందర్భంగా వ్యాస మహర్షికి పూజలు నిర్వహించారు. డాక్టర్ వైదేహి గురుపౌర్ణమి విశిష్టతను తెలియజేశారు. అవోపా రాష్ట్ర కార్యదర్శి సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు చింతా కృష్ణారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మద్ది సాయి రమేష్, మట్టుపల్లి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్ కాళ్లు పంపిణీ



పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం, ఎస్ఆర్ ఐవీఏ టీమ్ సహకారంతో పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం దివ్యాంగులకు జైపూర్ కాళ్లను ఉచితంగా అందించారు. కొద్ది రోజుల క్రితం కొంత మంది దివ్యాంగులకు గుర్తించి, కొలతలు తీసుకొని, ప్రత్యేకంగా తయారు చేసి సుమారు వంద మందికి జైపూర్ కాళ్లను అందించినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్‌సిటీ అధ్యక్షుడు గుండాల అశోక్‌బాబు తెలిపారు. జైపూర్ కాళ్లకు అయ్యే ఖర్చును రోటరీ క్లబ్ సభ్యులు నూతినారాయణ అందించినట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం ప్రాజెక్టు కన్వీనర్ పసుమర్తి రంగారావు, కార్యదర్శి పి.సాంబశివరావు, బి.సుధాకర్‌రావు, దళపతి, వంకాయల గోపి, కాకుమాను శ్రీనివాసరావు, నీరుమళ్ల రాజేష్ పాల్గొన్నారు.

ప్రయాణంలో భద్రత చాలా ముఖ్యం

ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



రోడ్డు భద్రతా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట: ప్రాణం అనేది అత్యంత విలువైందని, కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో రోడ్డు సేఫ్టీ ఎన్జీవో కన్వీనర్ ఆర్.కె.దుర్గ పద్మజ రూపొందించిన రోడ్డు భద్రతా అవగాహన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీటు బెల్టు ధరించడం తప్పనిసరిగా పాటించినపుడే వారి జీవితాలకు మనం రక్షణ కల్పించిన వారిమి అవుతామని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, సరైన అనుమతులు లేకుండా వాహనాలు నడపడం కూడా చట్ట రీత్యా నేరమని పేర్కొన్నారు. ఎన్జీవో సభ్యులు బంగారయ్య పాల్గొన్నారు.

యోగా కేంద్రాల నిర్వాహకులకు ఘన సన్మానం



మాజీ మున్సిపల్ చైర్మన్ గుప్తాను సన్మానిస్తున్న యోగా కేంద్ర నిర్వాహకులు

నరసరావుపేట: పట్టణంలోని పాతూరులోని శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయ ప్రాంగణంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో ఆదివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం ఆధ్వర్యంలో 31వ గురుపూజా మహోత్సవం, 175 ఏ అండ్ బీ ఆనంద మహోత్సవాలు నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర యోగా మంగళగిరి ప్రధాన కేంద్ర వ్యవస్థాపకులు డాక్టర్ ఆతుకూరి వెంకటేశ్వర యోగి గురూజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా హాజరైన రాష్ట్రంలోని 40 యోగా కేంద్రాల నిర్వాహకులు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తాలను ఘనంగా సన్మానించారు. నరసరావుపేట శాఖ యోగా కేంద్ర నిర్వాహకులు కూనిశెట్టి వెంకటజనార్ధన్, కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, ఆహ్వాన కమిటీ సభ్యులు పొలిమేర వెంకటరెడ్డి, నల్లపాటి చిన్నబ్బాయి, కనమర్లపూడి శారద, సురేష్, అడ్డగిరి రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా కనక దుర్గమ్మ బోనాలు



బోనాలు సమర్పిస్తున్న మహిళా భక్తులు

పిడుగురాళ్ల: పట్టణంలోని భవాని నగర్‌లో కనక దుర్గమ్మ బోనాల సమర్పణ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి దర్శించుకున్నారు. మహిళా భక్తులు బోనాలను నెత్తిన పెట్టుకొని గ్రామ పురవీధుల్లో తిరిగి అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు. రావూరి పూర్ణనంద శాస్త్రి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి, భక్తుల దర్శనార్థం ఉంచారు. ఆషాఢ మాసంలో మూడవ ఆదివారం కావటంతో మహిళా భక్తులు ఎక్కువ సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు చీర, జాకెట్, వడికట్టు బియ్యం, పూలు, గాజులు, పసుపు, కుంకుమతో బోనాలను సమర్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.